## క్లుప్తంగా

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



గన్నవరం: స్థానిక శ్రీకృష్ణనగర్‌లోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ వార్ల దేవస్థానంలో గురువారం ఆలయ దశమ వార్షిక వేడుకలు, ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృత సేవ జరిపారు. అనంతరం సహస్రనామార్చనలు, ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు సుముహూర్తంలో శ్రీగోవిందమాంబ సమేత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్లకు శాంతి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివార్లకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పలువురు ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు పాల్గొన్నారు.

# నిలిచిన గ్రావెల్ తవ్వకాలు

- గత పాలకులపై కక్ష సాధింపులో భాగంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం
- మూతపడిన క్వారీలు
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



క్వారీలో గ్రావెల్ తరలిస్తున్న లారీ(ఫైల్)

గన్నవరం: గత పాలకులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా జిల్లాలోని గ్రావెల్ క్వారీలు మూతపడ్డాయి. విజిలెన్స్ విచారణ పేరుతో ప్రభుత్వం గత పది నెలలుగా గ్రావెల్ తవ్వకాలను పూర్తిగా నిలిపివేసింది. విచారణ పూర్తయి నెలలు గడుస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో క్వారీలు తెరుచుకోవడం లేదు. దీంతో భవన నిర్మాణాలు, రోడ్లు, రైల్వే కాంట్రాక్ట్ పనులకు గ్రావెల్ మట్టి లభ్యత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా ఈ రంగంపై ఆధారపడిన టిప్పర్ యాజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు ఉపాధిని కోల్పోతున్నారు. ఎర్ర బంగారంగా పిలుచుకునే గ్రావెల్ మట్టి ఎక్కువగా గన్నవరం నియోజకవర్గం నుంచే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా జరుగుతుంది. నియోజకవర్గంలోని గొల్లనపల్లి, గోపవరపుగూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం, ముస్తాబాద, విజయవాడ రూరల్‌లో విస్తరంగా గ్రావెల్ కొండలు ఉన్నాయి. ఈ గ్రావెల్‌ను భవనాలు, రోడ్లు, రైల్వేట్రాక్ నిర్మాణ పనులకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. గత ప్రభుత్వంలో చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు చేపట్టిన జాతీయ రహదారి బైపాస్ రోడ్డు, విజయవాడ - గుడివాడ రైల్వేలైన్‌లో రెండో ట్రాక్ నిర్మాణాలకు ఇక్కడి గ్రావెల్ మట్టినే ఉపయోగించారు.

### గత పాలకులే లక్ష్యంగా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌తో పాటు అప్పటి ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలను లక్ష్యంగా చేసుకుంది. దీనికోసం గ్రావెల్ తవ్వకాల్లో భారీగా అవినీతి జరిగిందనే నెపంతో వారిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ విచారణ నిమిత్తం నియోజకవర్గంలోని గ్రావెల్ మట్టి తవ్వకాలను గత పది నెలలుగా పూర్తిగా నిలిపివేసింది. మూడు నెలలు క్రితం విజిలెన్స్ విచారణను పూర్తి చేసిన అధికారులు ప్రభుత్వానికి నివేదికను కూడా సమర్పించారు. ఇక్కడి గ్రావెల్‌ను అధికంగా కేంద్ర ప్రాజెక్ట్‌లకు ఉపయోగించినప్పటికీ గత పాలకులను దోషులుగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికోసం నెలలు తరబడి గ్రావెల్ తవ్వకాలను నిలిపివేసిన కూటమి సర్కార్ కొత్తగా అనుమతులు కూడా ఇవ్వడం లేదు. దీంతో గ్రావెల్ మట్టి రవాణా నిలిచిపోవడంతో ముఖ్యంగా భవన నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణ సమయంలో మెరువ నిమిత్తం గ్రావెల్ దొరక్కపోవడంతో యాజమానులకు భారంగా మారింది. అధిక ధరలను వెచ్చించి ఇతర ప్రాంతాల నుండి గ్రావెల్‌ను, మట్టిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

### దిక్కుతోచని స్థితిలో కార్మికులు..

గ్రావెల్ మట్టి తవ్వకాలు, రవాణాపై ఆధారపడి ఈ ప్రాంతానికి చెందిన వేలాది మంది జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది టిప్పర్ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు, క్వారీలు వద్ద పనిచేసి కూలీలు ఉన్నారు. గత పది నెలలుగా గ్రావెల్ తవ్వకాలు జరగకపోవడంతో టిప్పర్లు నిలిచిపోయాయి. కొంత మంది యజమానులు నెలనెల వాయిదాలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీలు టిప్పర్లను సీజ్‌చేసి తీసుకువెళ్లారు. మరికొంత మంది ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వాహనాలను విక్రయించుకుంటున్నారు. దీంతో వీరి వద్ద పనిచేసే డ్రైవర్లు, క్లీనర్లు ఉపాధి లేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. గ్రావెల్ క్వారీలను పునఃప్రారంభించాలని ఇటీవల వీరంతా కేసరపల్లిలో నిరసనకు సైతం దిగారు. పలుమార్లు ప్రభుత్వ ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తులు చేసిన సానుకూల నిర్ణయం రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

### సీహెచ్‌ఓల సమ్మెతో రోగులకు ఇబ్బందులు



వెలగలేరు పీహెచ్‌సీ వద్ద సమ్మె చేస్తున్న సీహెచ్‌ఓలు

విజయవాడరూరల్: జాతీయ ఆరోగ్య మెషిన్ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విజయవాడ రూరల్ మండలంలో 23 కేంద్రాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సమ్మె చేస్తున్నారు. 23 శాతం వేతన సవరణ చేయాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, గత 8 నెలలుగా ఉన్న పెండింగ్ ఇన్సెంటివ్స్, హెల్త్ క్లినిక్ అద్దె బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ విధులకు గైర్హాజరవడంతో గ్రామాల్లో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లకు వచ్చే బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

# ఘనంగా ప్రపంచ కార్మికుల దినోత్సవం

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సంఘ నేత వెంకటేశ్వరరావు ఎర్ర జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ నేతలు మిరప నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఆవుటపల్లి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ ప్రసాద్ పతాకావిష్కరణ చేశారు. రీజినల్ కార్యదర్శి జితేంద్ర రత్నాకర్, సీసీఎస్ డెలిగేట్ రంగారావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరావు, ఉపాధ్యక్షుడు పద్మనాభులు, కోశాధికారి టీకే రావు తదితరులు పాల్గొన్నారు.

**కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం**

పెనమలూరు: ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాటం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి షేక్.కాశిం అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా యనమలకుదురులోని 13 ప్రాంతాల్లో ఎర్ర జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. పెట్టుబడిదారులకు అండగా ప్రభుత్వం ఉండి కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని ఆరోపించారు. నేడు కార్మిక చట్టానికి గ్రహణం పట్టించారని ఆరోపించారు. కార్మికులు ప్రతి రోజు 8 గంటలే పని చేయాల్సి ఉండగా నేడు అనేక పరిశ్రమల్లో, దుకాణాల్లో కార్మికులతో 12 గంటలు పని చేయిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని లేని పక్షంలో ఐక్యపోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు షేక్.మస్తాన్‌వలి, వలీబీ, మేకా సత్యనారాయణ, చినపాపారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు.

**పోరంకిలో భారీ ర్యాలీ**

మేడే సందర్భంగా పోరంకిలో కార్మికుల భారీ ర్యాలీ చేసి ఎర్ర జెండాను ఎగురవేశారు. తాడిగడప మున్సిపాలిటీ కార్మికులు, ఆటో డ్రైవర్‌లు, భవన నిర్మాణ కార్మికుల, ఇతర రంగాల కార్మికులు పోరంకి నుంచి తాడిగడప జంక్షన్ వరకు బందరు రోడ్డుపై ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. రోజుకు 8 గంటలు పని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు వ్యతిరేకంగా రూపొందించిన నల్లచట్టాలు రద్దు చేయాలని అన్నారు. కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.లక్ష్మీప్రసన్న, మస్తాన్‌వలి, వై.సరళ, డేవిడ్‌రాజు, ఏడు కొండలు, వెంకటరెడ్డి, రత్నకరుణ, సీహెచ్.రాంబాబు, తిరువీధుల చంటి, చిరిగిరి చిన్న



గన్నవరం బస్టాండ్ వద్ద పతాకావిష్కరణ చేస్తున్న ఈయూ నేతలు

పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో యనమలకుదురు గ్రామంలో మేడే వేడుకలు ఘనంగా చేశారు. కార్యక్రమంలో నాయకులు లంక దుర్గారావు, మున్నంగి నరసింహారావు, కె.శేషగిరిరావు, అరుణ్ కుమార్, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో తాడిగడప సెంటర్‌లో ఎమ్మెల్యే బోడెప్రసాద్ మేడే వేడుకల్లో పాల్గొని జెండా ఎగురవేశారు. ఆటో వర్కర్స్, బిల్డింగ్ వర్కర్స్ పాల్గొన్నారు.



యనమలకుదురులో జెండా ఎగురవేస్తున్న కార్మికులు

లేబర్ కోడ్స్ రద్దు చేసే నూతన చట్టాలను కేంద్రం ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. ఆ చట్టాలను తీసుకొస్తే కార్మికులు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వాటిని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ పతాకాన్ని పవర్‌గ్రిడ్ నున్న యూనిట్ డెప్యూటీ జనరల్ మేనేజర్ కెవీ ఎల్లే చౌదరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు కమల, ప్రజా సంఘాల నాయకులు మాతంగి ఆంజనేయులు, గుంటక చినవెంకటరెడ్డి, జి.వి.రంగారెడ్డి, డాక్టర్ బి.శివరామ్, కలకోటి శ్రీనివాసరెడ్డి, ప్రభాకరరెడ్డి, సట్టు శ్రీనివాసరావు, సీహెచ్ రాంబాబు, సరేష్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు. నున్న పరిధిలో నాయకులు శివయ్య, పి.వెంకటేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి సీఐటీయూ పతాకాలను ఆవిష్కరించారు.

**కార్మికుల హక్కులను పాలకులు కాలరాస్తున్నారు**

గన్నవరం: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వెంకటరత్నం విమర్శించారు. ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దావాజిగూడెం, గన్నవరం, బుద్దవరం, రాజీవ్‌నగర్, అల్లాపురం గ్రామాల్లో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ఎర్రజెండాలను ఎగురవేశారు. నాయకులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ముక్కామల ఉమామహేశ్వరరావు, బండారు లక్ష్మయ్య, సాంబయ్య, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆత్కూరులో..**

ఉంగుటూరు మండలం ఆత్కూరులో మేడే సందర్భంగా కామ్రేడ్ అన్నే రామారావు స్థూపం వద్ద సీపీఎం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు టీవీ లక్ష్మణస్వామి, వెంకటరత్నం, వీరరాఘవులు, అట్లూరి సాంబశివరావు పాల్గొన్నారు.

**జంక్షన్‌లో వేడుకలు**

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకై ఐక్యతతో పోరాటం సాగించాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు బేతా శ్రీనివాసరావు, నల్లి ఆంజనేయులు అన్నారు. ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని హనుమాన్‌జంక్షన్‌లో గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో ఎర్ర జెండా ఎగురవేశారు. అనంతరం జంక్షన్ ప్రధాన కూడలి, ఆర్టీసీ బస్టాండ్, ఆటో స్టాండ్, పెరికీడు వంతెన, కానుమోలు, బండారుగూడెం, మల్లవల్లి, కొత్తపల్లి, వీరవల్లి గ్రామాల్లో మేడేను పురస్కరించుకుని కార్మిక సంఘాలు సీఐటీయూ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రధాన రహదారుల్లో కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ నాయకులు అబ్దుల్ బారీ, జుజ్జువరపు ఏసుపాదం, రాజనాల సురేష్, వడ్డి గిరి, ఎత్తుల రాము, భవన నిర్మాణ కార్మికుల సంఘం, ప్రైవేట్ ఎలక్ట్రికల్ మెకానిక్ వర్కర్స్, పార్శిల్ ముఠా వర్కర్స్, ఇసుక ముఠా వర్కర్స్, పెయింటర్స్, ఆటో డ్రైవర్స్ యూనియన్ల నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

### కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



కంకిపాడు మేడే వేడుకల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత ఎం.హరిబాబు

కంకిపాడు: పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసేందుకు కుట్ర పన్నుతోందని, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర నేత ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. కంకిపాడు పట్టణంతో పాటుగా మండలంలోని ప్రొద్దుటూరు, గొడవర్రు, మద్దూరు తదితర గ్రామాల్లో మేడే వేడుకలు గురువారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో హరిబాబు మాట్లాడుతూ కార్మికులకు, రైతులకు నష్టం కలిగించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం అవసరమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పంచకర్ల రంగారావు, ఈడా కోటేశ్వరరావు, వై.జోజి, పి.దుర్గారావు, జె.రవి, ఎం.శ్రీనివాసరావు, గద్దె సాంబయ్య, మండల కార్యదర్శి టీ.నరేష్, వి.శివశంకర్, జి.కుమారి, సీహెచ్ శ్రీహరి, ఎం.చంటి తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కంకిపాడు ఆటో స్టాండ్, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉప్పలూరు, తెన్నేరు గ్రామాల్లో మేడే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో జి.కుమారి, రామకృష్ణ, నాగరాజు, సర్వేశ్వరరావు, ఎం.లక్ష్మీనారాయణ, ఐ.చంద్రరావు పాల్గొన్నారు.

**నున్న గ్రామంలో వేడుకలు**

నున్న(విజయవాడరూరల్): ఎందరో మహానుభావులు కార్మికుల కోసం సాధించిన హక్కులను కాలరాసేందుకు మోడీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు సెక్టార్‌కు కట్టపెట్టాలని చూస్తున్నాయని ఆల్‌ఇండియా పవర్ గ్రిడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు వరప్రసాదరావు అన్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వద్ద గురువారం జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



బుద్దవరంలో జెండా ఎగురవేస్తున్న నేతలు



నున్న పవర్ గ్రిడ్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక నేతలు



గన్నవరంలో జెండా ఎగురవేస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు



తాడిగడప సెంటర్‌లో ర్యాలీ చేస్తున్న కార్మికులు



హనుమాన్‌జంక్షన్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

# విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి



కంకిపాడు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



గన్నవరం గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కంకిపాడు: విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, పుస్తక పఠనం అలవర్చుకోవాలని రైల్వే శాఖ సూపరింటెండెంట్ కె.రాంబాబు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చదవటం, పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. క్యారమ్స్, చెస్‌లో శిక్షణ ఇచ్చి, పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనంలో, కథలతో కూడిన పాటలు పాటించటం, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

**వణుకూరు గ్రంథాలయంలో..**

పెనమలూరు: వణుకూరు గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు. తోక కథలు చెప్పించి, విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం ఆటల పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు. పెనమలూరు గ్రంథాలయంలో విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి పి.హరీషా తెలిపారు.

**ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు**

గన్నవరం: మండలంలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక మండల పరిషత్ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు హిందీలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు, విశ్రాంత వెటర్నరీ ఉద్యోగి ధర్మారావు, ఇన్‌చార్జి లైబ్రేరియన్ పీడీ.లక్ష్మి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. పురుషోత్తపట్నం గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. గ్రామస్తుల సౌజన్యంతో విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. లైబ్రేరియన్ కె.కృపానందం పాల్గొన్నారు. ముస్తాబాద గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



వణుకూరులో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న అధికారులు



వీరవల్లిలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

**నీతికథల పఠనంతో వ్యక్తిత్వ వికాసం**

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ శిబిరంలో గురువారం విద్యార్థులకు నీతికథల పుస్తకాలను పరిచయం చేశారు. పంచతంత్రంతో పాటు పలు రకాల నీతికథల పుస్తకాలను విద్యార్థులకు అందించి చదివించారు. అంతే కాక కథలు చదవటం ద్వారా తెలుసుకున్న నీతి గూర్చి విద్యార్థులతో మాట్లాడించారు. నీతికథలు చదవటం వల్ల వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అలవర్చుకోవచ్చని గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి విద్యార్థులకు వివరించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరటానికి పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. అనంతరం హిందీ భాష అభ్యసనా తరగతులు, నృత్యంలో శిక్షణ ఇచ్చారు.

### ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు



గన్నవరం: స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద రెడ్ వాలంటీర్స్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. తొలుత ఆర్థిక విశ్లేషకుడు గన్నె వెంకట్రావు చలివేంద్రాన్ని ప్రారంభించి తాగునీరు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. సామాజిక సేవలో రెడ్ వాలంటీర్లు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సీపీఎం నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు పింఛన్లు అందజేత



రామవరప్పాడు: ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తోందని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 63 లక్షల మందికి 28 రకాల పింఛన్లు అందజేస్తోందన్నారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందజేశారు. ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో సచివాలయం సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. పలు గ్రామాల్లో సాంకేతిక సమస్య ఎదురవ్వడంతో కొంత మేర ఇబ్బందులు తలెత్తాయి. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

### కష్టాల్లో ఉన్న వారికి చేయూత అందించాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయడం వల్ల నిజమైన సంతోషం కలుగుతుందని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. స్థానిక 8వ డివిజన్ ఐటీఐ కళాశాల దగ్గర నివాసం ఉంటున్న విభిన్న ప్రతిభావంతుడు గుడివాడ రాజేష్ దంపతులకు జీవనోపాధి నిమిత్తం రూ.25 వేలు విలువ చేసే బడ్డీకొట్టును యలమంచలి జయప్రకాష్ గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుడైన రాజేష్ తన కుటుంబసభ్యులతో వచ్చి తనకు జీవనోపాధి కష్టంగా ఉందని తనను సంప్రదించాడని, వారికి జీవనోపాధి కోసం వైఎన్నార్ చారిటీస్ ద్వారా బడ్డీకొట్టును అందజేశామన్నారు. తోటి వారికి సహాయం చేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకుడు పుట్టగుంట రమేష్, పాట్లూరి రవి, జి.వాసు పాల్గొన్నారు.

### ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు



కంకిపాడు: టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు షిర్డీలో గురువారం ఘనంగా జరిగాయి. కుటుంబ సమేతంగా షిర్డీ వెళ్లిన వైవీ సుబ్బారెడ్డిని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి దంపతులతో కేక్ కట్ చేయించారు. అనంతరం షిర్డీలో కాగడ హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైవీ రెడ్డి, పిల్లంక శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

### బైక్ ఢీకొని ఆటోడ్రైవర్‌కు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అతి వేగంతో వచ్చిన బైక్ ఆటోడ్రైవర్‌ను ఢీ కొనడంతో గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడుకు చెందిన కొల్లిపర సుబ్రహ్మణ్యేశ్వరరావు(67) ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. బుధవారం ఉదయం అతను ఆటో కిరాయికి చిట్టినగర్‌కు వచ్చాడు. కేఎల్ రావు పార్కు వద్ద టిఫిన్ చేసేందుకు రోడ్డు దాటుతుండగా, చిట్టినగర్ నుంచి పాలప్రాజెక్టు వైపు వస్తున్న బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో సుబ్రహ్మణ్యేశ్వరరావు కుడి కాలు విరిగింది. దీంతో బాధితుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.